# స్కేప్ గోట్

(నవ్యసాహితి సమితి "స్వర్ణజయంతి ప్రత్యేకసంచిక" 2005, హైద్రాబాద్)

ఏడు కొండలకి మాటైతే లేదుగానీ... మనసుందిగా.... ఆ మనసనేది ఉండబట్టే ఇన్నాళ్ళూ ఇన్నేళ్ళూ తిండీ బట్టా నిలువనీడా ఇచ్చిన విశ్వాసానికి వాళ్ళ చేత ఎన్నో తిట్లు భరించాడు. ఆ మనసనేది ఉండబట్టే ఏ పాపం ఎరగని తను అనవసరంగా ఎప్పుడూ తిట్లు తింటున్నందుకు లోలోపల కుమిలిపోతుంటాడు... ఆ మనసనేది ఉండబట్టే... తనవల్ల ఒక్క పొరపాటు గానీ ఒక్క తప్పుగానీ లేకుండానే ఎప్పుడూ మాటలు పడుతున్నందుకు పొంగి వచ్చే అవేశాన్ని అణిచి పెట్టుకుంటూ బాధపడుతుంటాడు.

వాడి పేరులో వున్న ఏడుకొండల సంగతేమోగానీ వాడి బ్రతుకులో ఏడుపొక్కటే రాసిపెట్టాడా ఆదేవుడని పిస్తుంది.

ఏడుకొండలికి పన్నెండేళ్ళ వయస్సున్నపుడు వాళ్ళ నాన్న భద్రయ్య తీసుకొచ్చి వాడినా మేడలో పనికి పెట్టి వెళ్ళిపోయాడు.

"రాత్రి పగలు వాళ్ళింట్లోనే ఉండిపోవాలి. ఏపని చేప్తే ఆపని చెయ్యాలి. తిండీ బట్టా అన్నీ వాళ్ళే చూసుకుంటారు. ఇష్టమైతే నీ కొడుకుని వాళ్ళింట్లో పనికి చేర్చు. బాగా కలిగినవాళ్ళు... ఇంక నువ్వు నీకొడుకు గురించి పట్టించుకునే పనే ఉండదు". అంటూ ఆ మేడలో పనిమనిషి నాగమ్మ చెప్పడంతో వెంటనే ఏడుకొండల్ని తీసుకుని ఆ ఇంటికెళ్ళాడు భద్రయ్య.

భద్రయ్య తెల్లారి లేచి కూలి పన్లకి పోతే మళ్ళీ రాత్రి ఇంటికెప్పుడు చేరతాడో తనకే తెలియదు. పొద్దుపోయాక చేతిలో నాలుగు డబ్బులు పడగానే ఇల్లు గుర్తుకు రాదు. కల్లుపాక గుర్తొస్తుంది. భార్య పోయినాలుగేళ్ళయింది. ఇంట్లో ఉండేది కొడుకు ఏడుకొండలొక్కడే... వాడు మూగవాడు...అక్షరమ్ముక్క రానివాడు...

తప్పతాగి ఇంటికి ఏ అర్ధరాత్రో అపరాత్రో చేరుతుంటే.... ఏడ్చుకుంటూ భయం భయంగా గడుపుతూ మెల్లిగా ఎప్పుడో నిద్రలోకి జారుకుంటాడు.

తిండీ బట్టా ఇచ్చి వాళ్ళింట్లోనే ఆశ్రయం కూడా ఇచ్చి వాడి బాగోగులు వాళ్ళే చూసుకుంటే ఇంక తనకి ఏ బాధా ఉండదు కదా! తనెప్పుడింటికొచ్చినా... ఇంకా నిజం చెప్పాలంటే అసలు ఒకరోజు ఇంటి మొహం చూడక పోయినా దిగులూ ఉండదు తనకి... అదీ భద్రయ్య సంతోషం.

అమ్మగారితో అన్నీమాట్లాడి కొడుక్కి జాగ్రత్తలు చెప్పాడు. దిగులేం పెట్టుకోకు. అమ్మగారు బాగా చూసుకుంటారు నిన్ను. ఇంట్లోవాళ్ళు ఎవరేపని చెప్పినా చేసుకుపోతూ ఉండు. నీ అంత మంచి కుర్రాడు లేడన్నమాట తెచ్చుకోవాలి.

తండ్రి చెప్పిన వాటికన్నిటికీ తల ఊపాడు ఏడుకొండలు. అమ్మగారిచ్చిన డబ్బు జేబులో పెట్టుకుని సంబరంగా తండ్రి వెళ్ళి పోతుంటే ఏడుపొచ్చేసింది వాడికి.

మొత్తం ఆరుగురు ఆ ఇంటి జనాభా.

అయ్యగారు... అమ్మగారు... రెండేసేళ్ళు తేడా వున్న వారి సంతానం ముగ్గురు కొడుకులు... అమ్మగారి మేనకోడలు వెఱ్ఱిబాగులది... పుట్టగానే అమ్మా నాన్నల్ని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు... పిచ్చితల్లిగా పేరుపడిపోయిన పిల్ల.

ఏడుకొండలా ఇంట్లో పన్లో చేరినప్పుడు పిచ్చితల్లి ఏడెనిమిదేళ్ళ పిల్ల మూడో అబ్బాయి ఏడుకొండలి వయసు వాడే... ముగ్గురబ్బాయిలూ పైకి తెలియరుగానీ... పెద్దవాళ్ళకి తెలియకుండా వాళ్ళుచేసే అల్లరి పన్లు ఆగడాలకి అంతు ఉండదు.

ఏడుకొండలా ఇంట్లో పన్లోకి చేరిన కొన్నాళ్ళకే భద్రయ్య రోడ్ అక్సిడెంట్లో పోయాడు. ఇంక పూర్తిగా ఆ ఇంటికే అంకితమై పోయాడువాడు... ఇదెవరు పగుల గొట్టారనీ... అదెవరు విరక్కొట్టారనీ... ఇదెవరు చింపారనీ... అదెవరు తిన్నారనీ... ఆ చెట్టు పిందెలెవరు కోశారనీ ఇలా అమ్మకేకలు వేసినపుడల్లా పిల్లలు ముగ్గురూ కూడా ఆ పన్లు వాళ్ళలో ఎవరైనా కూడా ఏ పాపం ఎరగని ఏడు కొండలి మీదకి

నెట్టేసేవారు లేనిపోని సాక్ష్యాలు సృష్టించి, వాడు మూగవాడవటం వాళ్ళకి బాగా అలుసుగా ఉండేది. అమ్మగారి చేత తిట్లూ దెబ్బలూ తినటం వాడి వంతయ్యేది.

అందరికీ లోకువై... అలాగే... తిట్లు తింటూ.... ఆ ఇంట్లోనే పెరిగి పెద్దవాడయ్యాడు.... పాతికేళ్ళ వాడయ్యాడిప్పుడు.

ఇన్నేళ్ళూ తన మూగతనంతో... తన నిస్సహాయత ఆసరాగా తీసుకుని వాళ్ళు తనని ఏడిపించినది వేరు.... ఇప్పుడింత ఘోరం తన మీద మోపటం వేరు... ఎంత అన్యాయం?... ఏడుకొండలి మనసు ఘోషిస్తోంది. ఈ ముగ్గురు అబ్బాయిగార్లలో ఈ అత్యాచారం చేసిందెవరో? ఎవరికి వారు ఏమీ ఎరగనట్టు ఎలా నటిస్తున్నారో? ఈ నింద భరించడం తనవల్ల కాదు. ఆపుకోలేని దుఃఖంతో అమ్మగారి కాళ్ళమీద పడ్డాడు. చేసిన తప్పుకి క్షమించమంటూ కాళ్ళమీద పడ్డాడను కుందావిడ.

విసురుగా కాళ్ళు వెనక్కి లాక్కుంది. తక్షణమే బయటికి పొమ్మని రంకెలు వేసింది. అవతలి గది గుమ్మానికి ఆనుకుని నిల్చున్న పిచ్చితల్లివైపు చూశాడు ఏడుకొండలు.

తల్లీ! మనలాంటి వాళ్ళని ఆదేవుడెందుకు పుట్టిస్తాడో మరి? నీకు మతి లేదు. నాకు మాట లేదు. ఆ రెండూ ఉన్న వీళ్ళు మనకు చేసే అన్యాయం చూడు తల్లీ! చూడు! నువ్వు తల్లివి కాబోతున్నట్టు నిన్ను పరీక్షచేసిన డాక్టరమ్మ చెప్పిందట... ఈ ముగ్గురబ్బాయిగార్లలో ఎవరు ఈ అత్యాచారానికి పాల్పడ్డారో. చెప్పే శక్తి నీకు లేదు నా మీద వేస్తున్న ఆ నింద భరించే శక్తి నాకు లేదు. కళ్ళలో నీళ్ళతో కాలు బయట పెట్టాడు ఏడుకొండలు. ఎక్కడికి వెళ్ళాలో వాడికే తెలియదు. కానీచచ్చి సాధించేదేదీ లేదని మాత్రం వాడికి తెల్సు. బతుకు తెరువు కనిపిస్తుందన్న ఆశతోనే అడుగులు వేశాడు.

★ ★ ★